# షాక్ ట్రీట్‌మెంట్

పి. వి. కరుణాకరన్

హేవార్డ్స్ బాటిల్ ఓపెన్ చేసి, మూడు గ్లాసుల్లోనూ పోసాను. వెంకన్న సోడా కలిపాడు. శేషాద్రి చిప్స్ ప్లేట్లలో సర్దాడు.

ముగ్గురం గ్లాసులు ఎత్తాం.

"చీర్స్!" చేదు మందు వెచ్చగా గొంతులోంచి వెళుతోంది. చిప్స్ నములుతూ కిటికీ దగ్గరకు వెళ్ళి, సిగరెట్ అంటించి బయటకు చూసాను.

జనవరి చలిగాలి తెరలు తెరలుగా వచ్చి వణుకు పుట్టిస్తోంది. రాత్రి తొమ్మిది గంటలకే రోడ్డు మీద జన సంచారం తగ్గిపోయింది. వీధి చివర కొంత మంది గోలగా అరుస్తూ ఘర్షణ పడుతున్నారు.

"మీ ఆవిడ ఊరికెళ్ళ బట్టి కదా మనకీ మహదవకాశం దొరికింది? పరోక్షంగా వున్నా ఆవిడకు నా కృతజ్ఞతలు!" నిశ్శబ్దాన్ని చీలుస్తూ అన్నాడు వెంకన్న.

శేషాద్రి తల వూపాడు. "ఈ మధ్య చాలా రోజులయింది మందు పుచ్చుకుని .... నెలకో మూడు సార్లయినా పుచ్చుకుంటేనే గానీ మన ఆరోగ్యాలు బాగుండవు!" అన్నాడు.

"సందు చివర ఏదో గొడవ జరుగుతోంది. కొట్టుకుంటున్నారు ..." అన్నాను అటే చూస్తూ. "ఏదో చావనిద్దూ ... ఆ వెధవ గోల మనకెందుకు!" అన్నాడు శేషాద్రి.

సిగరెట్ విసిరేసి, కిటికీ తలుపులు మూసి వచ్చి కుర్చీలో కూర్చున్నాను.

"అంటే ఏమిటి? వాళ్ళు ఎలా చచ్చినా మన కనవసరం అంటావా?"

"కాకపోతే మరి? వెళ్ళి అపుతావా? జాగ్రత్త ... మధ్యలోనే బుర్ర బద్దలు కాగలదు!" అని పెద్దగా నవ్వాడు శేషాద్రి.

నేను కొద్దిసేపు మౌనంగా వున్నాను.

"నేను ఒక తమాషా విషయం చెబుతాను. వినే ఓపికుందా?" నా గ్లాసులో మిగిలింది ఖాళీ చేసి అన్నాను.

"కథ చెబుతావా?" వెటకారంగా అన్నాడు శేషాద్రి.

వాడికి నేరాసే కథల మీద సదభిప్రాయం లేదు. వాటిల్లో కమ్యూనిజం వుందంటాడు వాడు!

"కథలాంటిదే .... అయితే నిజంగా జరిగింది. బలవంతం లేదు .... వినాలనుంటేనే."

"చెప్పు. కబుర్లు చెప్పుకోవటానికేగా ఇది ఏర్పాటు చేసింది" నా గ్లాసును నింపుతూ అన్నాడు వెంకన్న.

తాగిన మందు లోపల మంటలు చిమ్ముతోంది. అయినా అదో రకమైన హాయిగా వుంది. గ్లాసులోది కొద్దిగా సిప్ చేసి, సిగరెట్ వెలిగించి, మొదలు పెట్టాను ....

"ఇది జరిగింది పోయిన వేసవిలో అనుకుంటాను. నేను సరదాగా ఒక ట్రిప్పు కొట్టి వద్దామని మా అక్కయ్య వాళ్ళ ఊరు .... గుంటూరు వెళ్ళాను ...."

"ఏమిటి వేసవిలో గుంటూరు సర్దాగా వుంటుందా?"

నేను కోపంగా చూసాను శేషాద్రి వైపు.





"నువ్వు మధ్యలో అడ్డుపుల్లలు వేయకురా...." విసుక్కున్నాడు వెంకన్న.

నేను మళ్ళీ మొదలు పెట్టాను.

"వేసవి కాలం కదా .... రాత్రి పూట గుంటూరులో అందరూ బైటే పడుకుంటారు. సరైన అద్దె కొంపలు దొరక్కపోతే సగం నడి బజార్లోనే పడుకుంటారు. మా బావ వాళ్ల వుంటోంది అట్లాంటి అద్దె కొంపలోనే.

ఒక రోజు రాత్రి ....

భోజనం చేసి, మంచాలు బైట వేసుకుని, బావ, నేను కబుర్లలోకి దిగాం. సమయం పది అయివుంటుంది.

హఠాత్తుగా మా వీధి చివర ... ఓ పది మంది గుంపుగా వున్నారు ... వాళ్ళ మధ్య కొట్లాట మొదలయింది ఓ పది నిముషాల పాటు వాళ్లు బూతులు తిట్టుకున్నారు. మాకు మాటలయితే సరిగ్గా విన్పించటం లేదు కానీ, ఏదో డబ్బుల విషయమై తీవ్రంగా ఘర్షణ పడుతున్నారు. ఆ పైనే సారాకొట్టు వుంది. అక్కడ చిత్తుగా తాగి, గొడవ చేసుకుంటూ వెళతారు వెధవలు" అన్నాడు వాళ్ళనేచూస్తూ మా బావ.

చూస్తూండగానే తగాదా ముదిరింది.

అది కొట్లాటగా మారిపోయి, ఒకణ్ణి పట్టుకుని అందరూ బాదటం మొదలు పెట్టారు. అప్పటికే ఆ ప్రహసనం చుట్టు ప్రక్కల ఇళ్ళ వాళ్ళు గమనిస్తూనే వున్నారు. ఎవ్వరిళ్ళలోనూ ఫోనులేదో...లేక వున్నా పోలీసులకు ఫోన్ చేసేదమ్ము లేదో.... ఉన్నట్లుండి మా బావ లేచాడు ...."

"ఎక్కడకి.... వాళ్ళను ఆపటానికే?" ఆశ్చర్యంగా అన్నాడు శేషాద్రి.

ఆరే పోయిన సిగరెట్ అవతల పారేసి అన్నాను ... "ఛ ... పక్కబట్టలు సర్దేసాడు. మంచం తీసుకుని లోపలకు వచ్చేయమన్నాడు! నేను అటు చూసాను. అప్పటికే ఆ వీధిలో బయట మంచం వేసుకున్న వాళ్ళందరూ లోపలకు జారుకున్నారు.

అదే సమయంలో గుంపులో, అప్పటి దాకా తన్నులు తిన్న మనిషి వాళ్ళ నుంచి తప్పించుకొని, బాణంలా మా వైపు పరుగెత్తుకునిరావటం ప్రారంభించాడు. నాకూ దడ పుట్టింది.

నేను లోపలకు పరిగెత్తాను. మా బావ హడావిడిగా తలుపులు గడియవేసాడు.

ఈ సారి కేకలు మా ఇంటి దగ్గరగా విన్పించాయి నేను, బావ కిటికి దగ్గరకు పరిగెత్తాం ..."

"జస్టేమినిట్.... నువ్వు తాగటంలేదు...."

నా గ్లాసు మళ్ళీ నింపాడు వెంకన్న. గ్లాసు అందుకుని సగం ఒక్క గుక్కలో త్రాగాను. మళ్ళీ చెప్పటం ప్రారంభించాను....

"వాడి వెనక పరిగెత్తిన మనుషులు వాణ్ణి మా యింటి ముందు పట్టేసారు. మళ్ళీ గుభీ గుభీ మని గుద్దులు .... ఉన్నట్లుండి మా గుండెలు అదిరిపోయేట్లు చావు కేక విన్పించింది.

నా కాళ్ళు గజగజ వణికేయి. నేను మరి కొంచెం పరీక్షగా చూసాను. గుంపులోంచి ఒకడు కుప్పలా కూలిపోయాడు. బహుశా వాళ్ళ చేతుల్లో తన్నులు తిన్న వ్యక్తి అయుంటారు. మున్సిపాల్టీ దీపం మసక వెలుతురులో వాడు అస్పష్టంగా కన్పిస్తున్నాడు. ఛాతీలో చాకు మెరుస్తోంది ... వెల్లకిలా పడున్నాడు.

వాడి చుట్టూ చేరిన వాళ్ళ క్షణం పాటు గుస గుస లాడారు. అంతే ... రాయివేస్తే చెదిరిన కాకుల్లా అటూ ఇటూ చెల్లాచెదురుగా పారిపోయారు.

చుట్టు ప్రక్కల అందరిళ్ళలో దీపాలు వెలుగుతున్నాయి. చాలా మంది కిటికీల దగ్గర్నే వున్నారు. చావుకేక విన్పించగానే కొంత మంది మాత్రం కిటికీలు మూశారు.

పడిపోయిన వాడు కుర్రాడిలాగున్నాడు. అయితే వాడు చావలేదు. పెద్దగా మూల్గుతున్నాడు. కొద్ది సేపటికి వాడు కళ్ళు తెరిచాడు, ఆ వీధంతా భయంకర నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. వాడి ఉఛ్వాసనిశ్వాసలు మాకు స్పష్టంగా విన్పిస్తున్నాయి.

హఠాత్తుగా వాడి కళ్ళు మా కిటికీ వైపు చూసాయి. కిటికీ దగ్గర బావ, నేను కన్పించాం. వాడు ఓరగా పాక్కుంటూ మా యింటి గుమ్మం వైపు రాసాగాడు.

"ఓసెయ్ ... కి టి కి వేసెయ్ ...." భయంగా అరిచాడు మా బావ.

"అయ్యా ...." దీనంగా పిలిచాడు వాడు.

"నన్ను రక్షించండి .... నే ను బ్రతికే వున్నాను ... హాస్పిటల్‌కు పంపండి... లేవలేక పోతున్నాను... దయచేసి పోలీసుల్ని పిల వ ం డి...." లే ని ఓపిక తెచ్చుకుని, అస్పష్టంగా అంటున్నాడు వాడు.

బావ నన్ను పక్కకు లాగి, కిటికీ రెక్కలు వేసేశాడు. మనిషి నిలువెల్లావణికి పోతున్నాడు.





నేను అక్కడే నిలుచున్నాను. వాడు పక్క ఇళ్ళ దగ్గరకు వెళ్లి అరవటం విన్పిస్తోంది. అయితే ఒక్కడు కూడా వాడి గోడు విన్పించుకున్నట్లు లేదు ..." చెప్పటం ఆపి, ఇద్దరి వంకా చూసాను నేను.

"బాగానే వుంది... మరీ డర్టీ ఫెలోస్ అయిపోయారు జనాలు!" అన్నాడు శేషాద్రి. నవ్వాడు వెంకన్న". తర్వాతేం జరిగిందో చెప్పు ..." నా గ్లాసులో మిగిలింది ఖాళీ చేసాను.

"మా బావను కూర్చోపెట్టి, నేను మళ్ళీ కిటికీ తలుపులు తీసాను. వాడు చాలా సేపటి నుంచీ అట్లా అరుస్తూనే వున్నాడు.

అయితే హఠాత్తుగా అరవటం ఆపేసాడు. లేచి నుంచున్నాడు. ఛాతీలోంచి చాకు లాగేసి, మడిచి ప్యాంటు జేబులో వేసుకున్నాడు. క్షణమాగి "రేయ్ నా కొడకల్లారా!" అంటూ గర్జించాడు.

"ఆఁ!" నోళ్ళు వెళ్ళబెట్టారు వింటున్న ఇద్దరూ.

"నోళ్లుమూసుకు వినండి. వాడు అప్పటి దాకా చేసింది యాక్షన్ చేసిన వాడి మిత్ర బృందం అంతా అక్కడి కొచ్చారు..."

"తమాషాగానే వుంది.... ఎందుకు చేశారుట యిదంతా?"

"వస్తున్నాను ... వాళ్ళందరూ కలిసి ఆ వీధి వాళ్ళను కొద్ది సేపు బూతులతో సత్కరించారు!

ఒక మనిషిని పది మంది కొట్టి, పొడిచి పారిపోయారు. నేను బ్రతికే వున్నాను ... నన్ను రక్షించండిరా అని అరిచి, మొత్తుకున్నా, ఒక్కడు కూడా బయటకు రాలేదు. మీరు అసలు మగాళ్ళేనా? పెళ్ళాం పక్కల్లో పడుకున్నప్పుడు తప్పితే మీకు మగతనం గుర్తుకు రాదా?

సమాజం కుళ్ళిపోయిందని చచ్చు కబుర్లు చెప్తారు ... సమాజంలో తోటి మనిషికి సాయం చేయటానికి ముందుకు రాని మీ కందరికీ కష్టాలొస్తే సమాజం సహాయం కావాలి....

అఖరుకు పోలీసు రిపోర్టివ్వటానికి కూడా భయమే .... పోలీసు గొడవల్లో ఎందుకు ఇరుక్కోవటమని ...

ఇలా చాలా సేపు ఆ వీధి వాళ్ళందర్నీ మాటలతో కుళ్ళ బొడిచారు. ఒక్కడూ కిమ్మన లేదు ..."

ఆయాసం తీర్చుకోవటానికి ఆగాను.

"బాగుంది ... వెళ్తూ వెళ్తూ వాళ్ళన్నదేమంటే తామేదో స్టూడెంట్స్ యూనియన్‌కు సంబంధించిన వాళ్ళమనీ, ఇప్పటికి యీ బహిరంగ ప్రదర్శన చాలా చోట్ల యిచ్చామనీ జనానికి యీ విధంగా షాక్ ట్రీట్‌మెంట్ యిస్తే ఏమన్నా ఫలితం వుంటుందేమోనని తమ ఆశ అనీ, ఎవర్నీ నొప్పించటం తమ అభిమతం కాదనీ, చెప్పి నిజమైన పౌరులుగా మెలగవలసిందిగా కోరి వెళ్లి పోయారు...."

కొద్ది సేపు మౌనం రాజ్యం చేసింది మా మధ్య. చివరకు వెంకన్న అన్నాడు ...." వాళ్ళు చేసిందంతా బాగానే వుంది .... కాని ఒకటి .... ... మనసులో ఆ వ్యక్తిని రక్షించా లనే కాంక్ష వున్నా ఎంత మంది వాణ్ణి రక్షించి, కోర్టుల చుట్టూ తిరగ్గలుగుతారు?"

నేను తలూపాను.

"నిజమే ... తన్నిన వాణ్ణి కాకుండా, తన్నులు తిన్న వాణ్ణి చూపించిన అర్భకులను దాదాపుగా తన్నినంత పని చేస్తారు మన అధికారులు. విదేశాలకూ, మనకూ తేడా అదే. కంటితో చూసిన సత్యాన్ని నిర్భయంగా బైటకు చెప్పలేని – చెప్పనీయని వ్యవస్థ మనది. మనం చేయగలిగింది ఏమీ లేదు .... ఇందులో ఇలా కుళ్ళి చావాల్సిందే ...."కసిగా అన్నాను. నెమ్మది నెమ్మదిగా నిషా తల కెక్కుతోంది. "ఎలా వుంది?" శేషాద్రిని అడిగాను.

"నీతో ఏకీభవిస్తున్నాను ..." అన్నాడు.

కొద్దిసేపాగి, శేషాద్రికి గుడ్‌నైట్ చెప్పి తడబడుతున్న అడుగులతో బయటకు కదిలాం వెంకన్నా, నేనూ. వీధి చివర యిప్పుడు గొడవలేదు.